సాక్షి మంచిర్యాల

ఆదివారం । 11 । మే । 2025

గరిష్టం/కనిష్టం
38.0 /28.0

వాతావరణం
ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రివేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

అమ్మా వందనం..

తల్లులకు పిల్లలన్నా.. ఇల్లన్నా ఎంతో ప్రేమ. ఆ తల్లుల ప్రేమ ఇల్లు, పిల్లలకే పరిమితం కాలేదు. దేశాన్నీ ప్రేమించారు. మాతృభూమిపై మమకారంతో దేశ సేవ కోసం పిల్లలకు ఉగ్గుపాల నుంచే దేశభక్తిని నూరిపోశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎందరో తల్లులు తమ పిల్లలను దేశ రక్షణ కోసం పంపించారు. మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

10లో▸



న్యూస్‌రీల్

కళాశాల భవన నిర్మాణం నా అదృష్టం

• మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

లక్సెట్టిపేట: తాను చదువుకున్న కళాశాల భవన నిర్మాణం చేపట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల పక్కా భవన నిర్మాణ పనులను పరిశీలించారు. చిన్ననాటి జ్ఞాపకాలు, తను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశానని, అటువంటి కళాశాల భవనం నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు స్వయంగా చూసుకుంటున్నానని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి వర్షాకాలం సమీపించకముందే పూర్తి చేసి ప్రారంభం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ.ఆరీఫ్, గద్దం త్రిమూర్తి, చింత అశోక్, శ్రీనివాస్, పింగిళి రమేష్, స్వామి, శ్రీధర్, కార్యకర్తలు, వైద్యాధికారి శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆసుపత్రి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాలేజీరోడ్డులో 450 పడకల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ మంచిర్యాలలో 450 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించారని, నాటి ప్రభుత్వ కృషి వల్లనే నూతన భవన నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, బేర సత్యనారాయణ, ఎర్రం తిరుపతి, శ్రీరాముల మల్లేశ్, వంగ తిరుపతి, పెంట నవీన్, జూపాక సుధీర్, నార్ల వంశీ, పడాల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

నగరంపై ఖాకీ నిఘా


రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మంచిర్యాల నగరంపై పోలీసులు నిఘా పటిష్టం చేశారు. జిల్లా కేంద్రానికి రైలు మార్గం, ఛత్తీసగఢ్, మహారాష్ట్ర సరిహద్దులను కలుపుతూ జాతీయ రహదారి మార్గం ఉండడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. శనివారం రైల్వేస్టేషన్, బస్టాండ్, జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల వద్ద బాంబ్‌స్క్వాడ్, నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించారు. ఆధార్‌కార్డు పరిశీలించి వేలిముద్రలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ ఇండియా–పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో నగరంలో ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు, పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యుద్ధంపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుపత్రాలున్న రైతులే పోడు వ్యవసాయానికి అర్హులు


కోటపల్లి: పోడు భూముల సాగుకు హక్కుపత్రాలు ఉన్న రైతులే అర్హులని, కొత్తవాటిని సాగు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఫారెస్టు కన్జర్వేటర్ శాంతారం అన్నారు. శనివారం పిన్నారం గ్రామంలోని పోడు రైతుల సాగుభూమిని పరిశీలించారు. ఇటీవల సుంకే నగేశ్ ఇంటిపై కోటపల్లి ఫారెస్టు అధికారులు దాడులు చేసి కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ ఫారెస్టు కన్జర్వేటర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ నిమిత్తం పిన్నారం గ్రామంలోని పోడు భూములను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి కొత్తగా పోడు వ్యవసాయం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అమ్మకు సమయమే బహుమతి

• ఏ బహుమతి ఇచ్చినా తక్కువే..
• తల్లి నిర్ణయాలకు ప్రాధాన్యం
• 'సాక్షి' సర్వేలో వెల్లడి


మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

మంచిర్యాలటౌన్: అమ్మ.. ఆమె ప్రేమ అనిర్వచనీయం. వెల కట్టలేనిది. ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనిది. సృష్టికి మూలం అమ్మ. పుట్టిన బిడ్డను జాగ్రత్తగా కాపాడుకుంటూ ఎదుగుతుంటే తాను పడిన కష్టాన్ని మరిచి మురిసిపోతుంది. బిడ్డ ఎదుగుదలను తన ఎదుగుదలగానే భావించి జీవితాన్ని త్యాగం చేస్తుంది. అలాంటి తల్లికి ఎంతమంది పిల్లలున్నా అందరూ సమానమే. అందరినీ సమానంగా చూస్తూ వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహిస్తూ ముందంజలో నిలిచేలా ప్రేరణనిస్తుంది. నాన్న ఎంత ప్రేమ చూపించినా తల్లి ప్రేమకే పిల్లలు కొంత ఎక్కువగా ముగ్ధులవుతారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 150 మంది విద్యార్థిని, విద్యార్థులతో 'సాక్షి' సర్వే నిర్వహించింది. ఉదయం నిద్ర నుంచి మేల్కొంది మొదలు అమ్మ సేవలకు తీరికుండదు. ఇంట్లో తల్లి అందించే సేవలకు గుర్తింపు లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమైంది. గతంలో కుటుంబ నిర్ణయాల్లో తల్లికి అంత ప్రాధాన్యం ఉండేది కాదు. కానీ నేటి తల్లులు ఇల్లును చక్కదిద్దడంలోనే కాదు అన్ని రంగాల్లోనూ తమదైన శైలిలో రాణిస్తున్నారు. అందుకే కుటుంబాల్లో ఏ నిర్ణయం తీసుకున్నా తల్లి పాత్ర ప్రధానంగా ఉంటోంది. మదర్స్ డే అంటే కేవలం బహుమతులు ఇవ్వడమే కాదు.. తల్లితో సమయం గడపడమే గొప్ప బహుమతిగా భావిస్తామని అంటున్నారు పిల్లలు.



అమ్మ ప్రోత్సాహంతోనే ఉద్యోగం


తల్లి లక్ష్మితో సుజాత

మంచిర్యాలటౌన్: నా చదువు ఎక్కడా ఆగిపోకుండా ఎప్పటికప్పుడు ప్రోత్సహించి.. ఉద్యోగం పొందాలని మా అమ్మ నన్ను ఈ స్థాయిలో నిలిపింది. నర్సింగ్ చదువులకు ఇంట్లో వారి నుంచి స్పందన రాకపోవడంతో మా అమ్మ జాడి లక్ష్మీ ప్రోత్సాహంతోనే ఈ కోర్సులో జాయిన్ అయ్యాను. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఉద్యోగంలో ప్రమోషన్లను సాధిస్తున్నా. నాడు మా అమ్మ ప్రోత్సాహం లేకుంటే ఒక గృహిణిగా ఇంటికే పరిమితం అయ్యేదానిని. నాకు అండగా నిలిచిన మా అమ్మ నేటికీ నాకు చేదోడుగా ఉంటూనే ఉంది.

– సుజాత, ఇంచార్జి ప్రిన్సిపాల్, మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ

చదువుతోనే జీవితమని నేర్పింది



మనిషి ఎలాగైనా బతుకొచ్చు కాని చదువుకుంటే జీవితం బాగుంటుందని మా అమ్మ మా చిన్ననాటి నుంచే చెబుతుండేది. మా అమ్మ గృహిణి, ఇంట్లోనే ఉంటూ బీడీలు చుట్టేది. స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన నాకు హోంవర్క్ చేసుకోమని చెప్పేది. ఇంట్లో ఇతర పనులేవీ చెప్పకుండా కొంత సమయం ఆడుకోమనేది. ఇలా చదువుతోపాటు రిలాక్సేషన్ కోసం ఆటలు ఆడుతూ ఒక స్థాయికి వచ్చేందుకు కృషి చేసింది. సివిల్స్ రాసేప్పుడు అండగా నిలిచి, తప్పకుండా ఉద్యోగాన్ని సాధిస్తావనే భరోసాను ఇచ్చింది. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్నానంటే మా అమ్మ అండగా నిలవడమే కారణం. మా అమ్మ ద్వారానే చదువు, ఉద్యోగం, ఒక స్థాయి రావడం నా జీవితంలో మర్చిపోలేనది.

– తౌటం శివాజీ, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్

అమ్మతోనే చెప్పుకునే వాడిని



నా చిన్నతనంలో అమ్మతోనే గడిపిన 11 సంవత్సరాలు ఎంతో కీలకంగా ఉండేవి. ఆ తర్వాత గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు హాస్టల్లోనే ఉండి చదువుకున్నా. నాకు ఏ సమస్య వచ్చినా, ఏది కావాలన్నా మా అమ్మకే చెప్పేవాడిని. బాగా చదువుకుని ఉద్యోగంలో స్థిరపడాలని మా అమ్మ ఎంతగానో కోరుకుంది. ఆ కోరిక తీర్చేందుకు బాగా చదివేవాడిని. కానీ డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే మా అమ్మ నా నుంచి దూరం కావడం, నాకు జాబ్ వచ్చే నాటికి అమ్మ లేని లోటును భరించడం నేటికీ నా వల్ల కావడం లేదు. అమ్మ కోరిక తీర్చినా అనే సంతృప్తి ఉన్నా అమ్మ ఉంటే బాగుండుననే బాధ ఉంది.

– సిహెచ్.దుర్గాప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మంచిర్యాల

అర్జీలు అధికం


భీమారం మండలం ఆరెపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్(ఫైల్)

• ఆరు రెవెన్యూ గ్రామాల్లో 900పైనే దరఖాస్తులు
• సాదాబైనామా సహా 'ధరణి'లో పరిష్కరించలేనివే..
• 'భూభారతి' పైలట్ మండలం భీమారంలో వినతులు
• ఈ నెల 16వరకు మరో ఆరు గ్రామాల్లో సదస్సులు పూర్తి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ధరణి' స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన 'భూభారతి' పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని భీమారం మండలంలో అమలవుతోంది. ఇందులో భాగంగా అధికార యంత్రాంగం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ అర్జీలు స్వీకరిస్తోంది. గత కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలపై అర్జీలు అధికంగా వస్తున్నాయి. మండలంలో మొత్తం 12 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ నెల 5న సదస్సులు ప్రారంభం కాగా ఆరు గ్రామాల్లో పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో ఈ నెల 16వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా జూన్ 2నుంచి అన్ని మండలాల్లో అమలు చేస్తారు. ఈ క్రమంలో కొత్త రెవెన్యూ చట్టం అమలులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉండేలా పకడ్బందీగా అమలు చేసేలా సదస్సులు నిర్వహిస్తున్నారు. పైలట్ మండలంలో నలుగురు తహసీల్దార్లను ప్రత్యేకంగా కేటాయించారు. ప్రత్యేకంగా రెండు బృందాలు ఏర్పాటు చేసి తహసీల్దార్లు, ఆర్ఐ, సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు రెవెన్యూ సదస్సులను పరిశీలిస్తూ రోజువారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలనలు చేస్తూ ప్రత్యేక నమూనాలో నమోదు చేస్తున్నారు. ఈ బృందాలు ఆఫీసు టీం డెస్క్, క్షేత్ర స్థాయి టీంలు, ఆర్ఎస్ఆర్‌లో హెచ్చులు, నిషేధిత భూములు, భూ సేకరణ, సరిహద్దు వివాదాలు, సాదాబైనామా, అసైన్‌మెంటు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించాలి.

సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు

మద్దికల్	154
ఆరేపల్లి	113
కొత్తపల్లి	156
పోలంపల్లి	104
అంకుశపూర్	113
బూరుగుపల్లి	343

విచారణ చేస్తున్నాం..

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై తొలుత విచారణ చేస్తున్నాం. ఆ మేరకు నోటీసులు ఇస్తున్నాం. తదుపరి సంబంధిత సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– సదానందం, తహసీల్దార్, భీమారం

సాదాబైనామాలే అధికం

ధరణి పోర్టల్‌లో గతంలో పరిష్కారం కాని భూ సమస్యలే అధికంగా వస్తున్నాయి. ఇందులో అధికంగా సాదాబైనామాలు, విరాసత్ అర్జీలు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక ఇరువర్గాల్లో భూ వివాదాలు, నిషేధిత జాబితా తదితర వినతులు ఉన్నాయి. అర్జీదారుల సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక దరఖాస్తు నంబరుతో భూ యాజమాని పేరు, ఆధార్, మొబైల్, చిరునామా, సర్వే నంబరు, పాస్‌బుక్ నంబరు సమాచారంతోపాటు భూ సమస్యను వివరించేందుకు ప్రత్యేక కాలం ఉంది. సొంత ధ్రువీకరణ చేస్తూ అర్జీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు అర్జీలు తీసుకుంటున్నారు. తదుపరి నోటీసులు ఇస్తున్నారు. అర్జీల్లో పేర్కొన్నట్లు తగు వివరాలు, ఆ మేరకు తగిన ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సిందిగా కోరుతున్నారు. అయితే తెల్లకాగితాలపై క్రయ విక్రయాలు చేసిన సాదాబైనామాపై ఇంకా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంతేకాక దీనిపై కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో అర్జీదారులు తమకు భూ యాజమాన్య హక్కులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నారు.

భారత సైనికుల సేవలు మరువలేనివి


పహల్గాం మృతులకు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలు


మాజీ సైనికులతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

• దేశ సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ
• పహల్గాంలో మృతులు, ఆర్మీ జవాన్ మురళీనాయక్‌కు నివాళులు
• మాజీ సైనికులకు ఎమ్మెల్యే దంపతుల సన్మానం

మంచిర్యాలటౌన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు జరిపి అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్నారని, అందుకు దీటుగా బదులు ఇస్తున్న భారత సైనికుల సేవలు మరువలేనివని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా జిల్లా కేంద్రంలో మాజీ దేశ సైనికుల కవాతు, ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉగ్రదాడులతో దేశాన్ని అల్లకల్లోలం చేయాలని చూస్తున్న ఉగ్రమూకలకు భారత సైన్యం తగిన బుద్ధి చెబుతోందని, దేశ రక్షణలో సైనికులు ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్నారని తెలిపారు. ర్యాలీ అనంతరం పహల్గాం ఉగ్రదాడిలో మృతులు, వీరమరణం పొందిన ఇండియన్ ఆర్మీ జవాన్ ఎం.మురళీనాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ దేశ సైనికులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

• క్రమశిక్షణ ఉంటే వృత్తిలో విజయం
• ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు
• న్యాయవాదుల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రభాకరరావు

మంచిర్యాలక్రైం: న్యాయవాద వృత్తిలో నైపుణ్యత, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుచిత్ర ఇన్ హోటల్‌లో శనివారం ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన న్యాయవాదుల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థలో రోజురోజుకు అనేక కొత్త చట్టాలు వస్తున్నాయని, వాటిపై న్యాయవాదులకు శిక్షణ అవసరమని అన్నారు. ప్రతీ న్యాయవాదికి క్రమశిక్షణ, నిబద్ధత, చట్టాలపై అవగాహన లేకుండా వృత్తిలో విజయం సాధించలేమని పేర్కొన్నారు. ప్రతీ న్యాయవాది బెంచ్ అండ్ రిలేషన్ నేర్చుకోవాలని అన్నారు. సామాజిక బాధ్యతతో న్యాయవాదులు కక్షిదారులకు న్యాయం చేయలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, బార్‌కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల ఏమాజి, జాడి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి శైలజ, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి మురళి, సీనియర్ న్యాయవాదులు రాజన్న, చిట్ల రమేష్, రాజేష్‌గౌడ్, రవీందర్‌రావు, రవీందర్, భుజంగ్‌రావు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా వాలీబాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న జీఎం దేవేందర్

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరుగనున్న ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, సీఐ శశిధర్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మందమర్రి జీఎం దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని తెలిపారు. గెలుపు, ఓటములను లెక్క చేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. క్రీడల వల్ల చక్కటి క్రమశిక్షణ అలవర్చుకోవచ్చని, సమాజంలో మంచి పౌరులను తయారు చేయడానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. అనంతరం క్రీడా ప్రతిజ్ఞ చేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై రాజశేఖర్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ క్రీడాకారులు బెల్లం శ్రీనివాస్, యాకూబ్, శివ, ఈశ్వరాచారీ, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ఇటిక్యాలలో అదనపు కలెక్టర్ మోతీలాల్

లక్సెట్టిపేట: వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శనివారం మండలంలోని పోతపల్లి, లక్ష్మీపూర్, ఇటిక్యాల, మిట్టపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులను పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు పడుతున్నాయని, గన్నీ బ్యాగుల కొరత ఉంటే తెలియజేయాలని అన్నారు. మిట్టపల్లి గ్రామంలో శివరామ క్రిష్ణ ట్రేడర్స్ మిల్లును పరిశీలించారు. ఇప్పటి వరకు 84,700 బస్తాలను మిల్లుకు చేర్చినట్లు తెలిపారు. మిల్లుల వద్ద లారీలను అన్‌లోడ్ చేసిన వెంటనే పంపించాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని అన్నారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు విధిగా పాటించాలి


మాట్లాడుతున్న డీడీఎంఎస్ రాజీవ్ ఓం ప్రకాశ్ వర్మ

మందమర్రిరూరల్: భూగర్భ గనులు, ఓపెన్ కాస్టు గనుల్లో విద్యుత్ భద్రత ప్రమాణాలు విధిగా పాటించాలని సింగరేణి డీడీఎంఎస్(ఎలక్ట్రికల్) రాజీవ్ ఓం ప్రకాశ్‌వర్మ అన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని కేకేఓసీ, కేకే 5 గనుల్లో నాలుగు రోజులపాటు సాధారణ తనిఖీలు నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ హాలులో ఎలక్ట్రికల్ సేఫ్టీ, సాంకేతిక ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యుత్ అపాయాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఎస్‌వోటు జీఎం విజయ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, ఏఎస్‌వో రవీందర్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, కేకే ఓసీపీవో మల్లయ్య, ఇంజనీర్లు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమ్మా వందనం..



- దేశ సేవకు పిల్లలను పంపిన మాతృమూర్తులు ఎందరో..
- నేడు మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

తల్లులకు పిల్లలన్నా.. ఇల్లన్నా ఎంతో ప్రేమ. ఆ తల్లుల ప్రేమ ఇల్లు, పిల్లలకే పరిమితం కాలేదు. దేశాన్నీ ప్రేమించారు. మాతృభూమిపై మమకారంతో దేశ సేవ కోసం పిల్లలకు ఉగ్గుపాల నుంచే దేశభక్తిని నూరిపోశారు. నేడు ఎంతోమంది సైనికులు సరిహద్దులో దేశ సేవ చేస్తున్నారంటే ఆ మాతృమూర్తులే కారణం. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సైనికుల విజయం వెనుక ఉన్నది ఆ తల్లులే. దేశానికి ఎంతోమంది వీర సైనికులను అందించిన తల్లులపై నేడు మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

పట్టుదలకు ప్రోత్సాహం



శ్యామల

బెల్లంపల్లి: తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన ఎనగంటి శ్యామలకు దేశమన్నా.. దేశభక్తి అన్నా ఎనలేని అభిమానం. అణువణువునా మాతృదేశంపై మమకారం పెంచుకుంది. ఎనగంటి శ్యామల, సమ్మిరెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. సమ్మిరెడ్డి సింగరేణి కంపెనీలో కార్మికుడిగా పని చేసేవారు. పిల్లలు చిన్నతనంలో ఉండగానే 1988లో అకాల మరణం చెందారు. దీంతో కుటుంబ బాధ్యతలు శ్యామలపై పడ్డాయి. భర్త వారసత్వంగా వచ్చిన సింగరేణి ఉద్యోగం చేస్తూ ముగ్గురు పిల్లలను పెంచి పెద్ద చేసింది. చిన్న కుమారుడు రాజశేఖర్ డిగ్రీ చదువుతూనే 2006లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించాడు. తల్లి ఆశించినట్లుగానే దేశ రక్షణలో విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజశేఖర్ పెద్ద నాన్న కుమారులు ఒకరు ఇండియన్ ఎయిర్ ఫోర్స్, మరొకరు నేవీలో పని చేసేవారు. వారి స్ఫూర్తితో మూడో ప్రయత్నంలో ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం సాధించి తల్లి కలను సాకారం చేశాడు. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలో సార్జెంట్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. దేశ సేవ చేయాలనే పట్టుదల కుమారుడికి ఉండడంతో ప్రోత్సహించింది. రెండు సార్లు విఫలమైనా వెన్నుతట్టి అండగా నిలబడడంతో నేడు దేశ సేవలో ముందున్నాడు.

గత 15 ఏళ్లుగా విధులు



కస్తూరి లక్ష్మి

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కస్తూరి శ్రీనివాస్ గత 15 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఈయన తల్లి కస్తూరి.. కుమారుడు సైనికుడిగా దేశానికి సేవలందించాలని కోరుకుంది. అనుకున్నట్లుగా ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం యుద్ధ వాతావరణ సమయంలో దేశాన్ని రక్షిస్తున్నందుకు గర్వపడుతున్నా.

సంతోషంగా ఉంది



కమల

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన రాజేశ్వర్ ఆర్మీలో ఢిల్లీలో పనిచేయడం ఆనందంగా ఉంది. పాక్‌తో జరుగుతున్న యుద్ధం సమయంలో పనిచేయడం గర్వంగా ఉంది. దేశం కోసం కుమారుడిని ఆర్మీలో చేర్పించడం ఆనందంగా ఉంది.

కుటుంబం కన్నా దేశం ముఖ్యం



వేముల లక్ష్మి

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన వేముల లక్ష్మి కుమారుడు నరేశ్ ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నాడు. తనకు కుటుంబం కన్నా దేశమే ముఖ్యం. దేశం కోసం తన కుమారుడు శత్రుదేశంతో పోరాటం చేయడం తల్లిగా గర్వంగా ఉంది.

సరిహద్దులో రక్షణ



ఇచ్చోడ: నా పేరు ముండే లోభ బాయి. మాది ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్. నా ఇద్దరు కుమారులు మాధవ్ (బీఎస్ఎఫ్), ధనరాజ్ (ఆర్మీ)లో ఐదేళ్లుగా పనిచేస్తున్నారు. దేశ సరిహద్దులో రక్షణగా ఉన్నారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో విజయం కోసం కృషిచేస్తారు.

గర్వపడుతున్నా



దస్తురాబాద్: మండలంలోని దేవెనిగూడెం గ్రామానికి చెందిన అల్లటి ఎల్లవ్వ–రాజన్న దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్, చిన్న కుమారుడు మిలిటరీలో ఉద్యోగాలు చేస్తున్నారు. దేశ సరిహద్దులో రక్షణగా ఉంటున్న ఇద్దరు కుమారులను చూసి గర్వంగా ఉంది.

పహారా కాస్తున్నాడు



లక్ష్మి

లక్ష్మణచాంద: లక్ష్మణచాందకు చెందిన నెర్వస్‌పెల్లి లక్ష్మి కొడుకు నరేశ్ 8 ఏళ్లుగా దేశ సైనికుడిగా పనిచేస్తున్నాడు. దేశం కోసం పహారా కాస్తూ రక్షిస్తున్నందుకు తల్లిగా ఎంతో గర్విస్తున్నా.

భయం లేదు



సంధ్య

లక్ష్మణచాంద: ధర్మారం గ్రామానికి చెందిన అశ్వంత్ కుమార్ రెండేళ్ల క్రితం అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. జమ్మూలో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు దేశం కోసం పోరాటం చేయడంపై తనకు భయం లేదు.

ఆర్మీ జవాన్ కావాలని..



తాంసి: నా పేరు దాసరి సువర్ణ. మాది పొన్నారి గ్రామం. మా చిన్న కుమారుడు నవీన్ చిన్నప్పటి నుంచే ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించాలని కలలు కనేవాడు. సాకారం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యం బారినపడ్డాడు. దేశ సేవ కోసం విధులు నిర్వహిస్తుండగానే మృతి చెందాడు. కుమారుడు బతికి ఉండగా దేశ సేవలో ఉన్నాడని మా కుటుంబానికి గర్వ కారణంగా ఉండేది. ప్రస్తుతం కుమారుడి జ్ఞాపకార్థం గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశాను.

అన్నీతానై..



విజయ

కుంటాల: కుంటాలకు చెందిన పెద్దోల్ల విజయ అన్నీతానై.. తన పిల్లలను పెంచి పెద్ద చేసింది. భర్త లింగయ్య పిల్లలు రెండేళ్ల వయసు ఉన్నప్పుడే మృతి చెందాడు. కాయ కష్టంచేసి పిల్లలను చదివించింది. పెద్ద కుమారుడు అనిల్ కుమార్ నేవీకి, చిన్న కుమారుడు సుధీర్ కుమార్ స్పీచ్ థెరపీగా పనిచేస్తున్నాడు. పిల్లలను ప్రయోజకుల్ని చేసిన విజయ పలువురికి ఆదర్శంగా నిలిచింది.

వైకల్యం ఉన్నా పిల్లలకు సపర్యలు



ఇద్దరు పిల్లలకు అన్నం తినిపిస్తున్న తల్లి బత్తిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని తుమ్మగూడ పంచాయతీ పరిధి గోపాల్ సింగ్‌తండాకు చెందిన అంతర్వేది చందసింగ్, బత్తిబాయిలది నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు ఆరుగురు సంతానం. రేఖ(17), ఆర్థిక(9) పుట్టుకతో వైకల్యంతో జన్మించారు. నాలుగేళ్లలో తండ్రి వ్యవసాయ పనులతోపాటు కూలీ పనిచేస్తున్నాడు. తల్లి ఆ ఇద్దరు కూతుళ్లకు సపర్యలు చేస్తూ చూసుకుంటుంది.

అలా నాన్నతో తిట్లు తప్పాయి



దేవేందర్‌రావు సీఐ చెన్నూర్

చెన్నూర్: నాది అమ్మనగుర్తి గ్రామం. సైదాపూర్ మండలం. ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాను. నా చిన్నప్పుడు దోస్తులతో ఆడుకునేందుకు బయటకు వెళ్లాను. మా నాన్న ఆగమరావుకు చదువంటే చాలా ఇష్టం. ఇంటికి వచ్చి దేవేందర్ ఎటుపోయాడని మా అమ్మను అడిగారు. చదువుకునేందుకు క్లాస్‌మెంట్ ఇంటికి వెళ్లాడని చెప్పింది. నేను ఇంటికొచ్చాక అడిగివారు. సమాధానం చెప్పేలోగా అమ్మ ముందుగానే వాడు దోస్తు ఇంటికి చదువుకునేందుకు వెళ్లాడు అని చెప్పాను కదా అంది. అలా నాన్నతో తిట్లు తప్పాయి. ఆ రోజున నేను ఎన్నడూ మర్చిపోలేను. ఆ నాటి నుంచి అమ్మకు చెప్పకుండా ఎటూ వెళ్లలేదు.

దేశసేవలో గర్విస్తున్నా



ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: నా పేరు రేండ్ల కళావతి. నాది మావల మండల కేంద్రం. మా ఆయన భూమన్న. మాది వ్యవసాయ కుటుంబం. నాకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు వ్యవసాయం చేస్తుండగా ఇద్దరు కుమారులు రేండ్ల మహేశ్ (యూపీ), రేండ్ల నగేశ్ (బళ్లారి)లో ఇద్దరు ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. దేశం కోసం ఇద్దరు కుమారులు సేవ చేయడం నాకు ఎంతో గర్వంగా ఉంది.

ఆనందంగా ఉంది



నా పేరు రొడ్డ గంగమ్మ. నాది మావల. నాకు ముగ్గురు కుమారులు గంగన్న, ప్రదీప్, నవీన్. భర్త కర్రెన్న పిల్లల చిన్నతనంలోనే మరణించాడు. కూలీ నాలీ చేసి వారిని పెంచాను. చిన్న కుమారుడు ఉదంపూర్ ఆర్మీ బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవులపై ఇంటికి రాగా ఆదివారం తిరిగి పయనమవుతున్నాడు.

ధైర్యంగా పోరాటం చేస్తుండు



నా పేరు నందనవేణి గంగమ్మ. మాది మావల. మా ఆయన రాములు. పిల్లలు చిన్నతనంలో మృతిచెందాడు. ముగ్గురు ఆడపిల్లలు రాజమణి, విజయ, శ్రీవాణి ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ పంజాబ్ లోని ఫిరోజ్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు దేశ ప్రజల భద్రత కోసం వీరోచితంగా పోరాడటం నాకు చాలా గర్వంగా ఉంది.

ఆర్మీలోకి పంపించాను



ఇచ్చోడ: నా పేరు శివనంద. మాది ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్. నా ఇద్దరు పిల్లలు అనిల్, ఉత్తం దేశ సేవ కోసం ఆర్మీలోకి పంపించాను. పదేళ్లుగా కశ్మీర్‌తోపాటు దేశ సరిహద్దులో పనిచేశారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇద్దరు కుమారులు పాల్గొనడం గర్వంగా భావిస్తున్నా.

ఆర్మీలో పనిచేయాలని కోరిక



ఎర్ర అంకు

కాసిపేట: దేవాపూర్‌కు చెందిన ఎర్ర అంకుకు ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు. కుమారుడు శ్రీనివాస్ దేశ భక్తితో 16 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నారు. చిన్ననాటి నుంచి ఆర్మీలో పనిచేయాలని కోరిక మేరకు పంపించాను.

అదృష్టంగా భావిస్తున్నా



బోథ్: నా పేరు కదం అనసూయ. నాకు ఐదుగురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఆర్మీలో విధులు నిర్వహిస్తారు. రెండవ కుమారుడు ప్రవీణ్ కుమార్, మూడవ కుమారుడు ప్రతాప్‌లు ఆర్మీలో పనిచేస్తున్నారు. నా ఇద్దరు కుమారులు ఆర్మీలో విధులు నిర్వహించడం ఆనందంగా ఉంది. అదృష్టంగా భావిస్తున్నా.

సంతోషంగా ఉంది.



బోథ్: నాపేరు తక్కల స్వరూప. నాకు కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త మృతిచెందిన కొంతకాలానికి కుమారుడు శైలన్ రెడ్డికి ఆర్మీలో ఉద్యోగం వచ్చింది. ఆర్మీలో విధులు నిర్వహించడం ఆనందంగా ఉంది. దేశం కోసం పోరాడే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

నా కల నెరవేర్చాడు



– లక్ష్మిబాయి

తానూరు: భోసికి చెందిన బాయి లక్ష్మి బాయి–భూమన్న దంపతుల కుమారుడు సాయినాథ్. 2004లో ఆర్మీలో ఉద్యోగం సాధించి విరమణ పొందాడు. తల్లి ఆశయం నెరవేర్చేందుకు 2024లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి కల నేరవేర్చడంతో తల్లి సంతోషం వ్యక్తం చేస్తోంది.

క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలో గల గంజ్‌రోడ్ మర్వాడి హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకుడు సుమిత్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆలయకర్త రాజు పూజ కోసం ఆలయానికి వచ్చాడు. అప్పటికే తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. హనుమాన్ విగ్రహానికి అలంకరించిన కండ్లు, గద, ముఖంతోపాటు పార్వతిదేవి విగ్రహ కిరీటం, అదే విధంగా గణేశ్ విగ్రహానికి ఉన్న కిరీటాలు కనిపించలేదు. దీనిపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సిబ్బంది డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని తెలిపారు. కాగా చోరీకి పాల్పడిన నిందితుడిని రాత్రి అరెస్ట్ చేశారు. భీంపూర్ మండలంలోని నిపానికి చెందిన ఆత్రం దయానంద్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి 8 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు.

స్క్రాప్ షాపులపై ఆకస్మిక దాడులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ, నార్నూర్, బోథ్ వంటి పది మండలాల్లో 35 ప్రత్యేక బృందాలు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించాయి. 13 స్క్రాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమైనట్లుగా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. లభ్యమైన షాపులపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగలించిన సరుకు, వస్తువులను వాహనాలను, రాగి లోహాలను కొన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలోని రఫీక్, పంజేషా కాలనీలోని ఇస్సాక్, హమీద్‌పూరలోని రియాజ్, సయ్యద్ బాబు, మహమ్మద్ ఫాజిల్, గోరే, అఫ్రాజ్ బటియా, కరణ్, ముజ్జు, షబ్బీర్ ఖాన్, సత్పురే ప్రమోద్, షేక్ యునూస్, మహ్మద్ ఫయాజ్ షాపుల్లో పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఫెన్సింగ్ వైర్ బండిళ్లు, రాగి, గ్యాస్ సిలిండర్లు, సబ్ మెర్సిబుల్ మోటార్లు, కరెంట్ సర్వీస్ వైర్, బైక్ ఇంజిన్లు, అల్యూమినీయం బ్యాగ్, ఆటో, ఆటో ఇంజిన్, ఇన్వర్టర్లు, పెద్ద బ్యాటరీలు, బైక్‌లు, హెచ్‌పీ మోటార్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వ్యాపారి

మందమర్రిరూరల్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ వ్యాపారి మోసపోయాడు. ఈ ఘటన మందమర్రిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మందమర్రి మార్కెట్ ఏరియాకు చెందిన ట్రేడర్స్ వ్యాపారికి గుర్తుతెలియని వ్యక్తులు గతనెల 7న ఫోన్ చేసి, 8న తమకు 25 రేకుల డబ్బులు పంపుతామని వాట్సాప్ ద్వారా స్కానర్ పంపించారు. దానికి సదరు వ్యాపారిని ఒక రూపాయి పంపించాలని సూచించారు. వ్యాపారి రూపాయి పంపడంతో రెండు రూపాయలు వచ్చాయి. మీకు రేకుల డబ్బులు మొత్తం ఇలాగే వస్తాయని, ఇది ఆర్మీ మిషన్ అని ఆర్మీ వాళ్ల ద్వారా డబ్బులు వస్తాయని నమ్మబలికారు. రెండు, మూడు లింకులు పంపి వాటిని ఓపెన్ చేయమన్నారు. ట్రేడర్ వ్యాపారి లింక్‌లు ఓపెన్ చేసినా ఎలాంటి డబ్బులు రాకపోగా తన అకౌంట్ నుంచి రూ.96,482 డబ్బులు పోయినట్లు మెసెజ్ రావడంతో మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తండ్రిని రోకలితో కొట్టి చంపిన తనయుడు

- నిర్మల్ జిల్లా రాజూరలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేశ్



గన్నారాం భూమన్న మృతదేహం

లోకేశ్వరం: తండ్రిని రోకలితో కొట్టి తనయుడు చంపాడు. నిర్మల్ జిల్లా మండలంలోని రాజూర గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ముధోల్ సీఐ మల్లేశ్ కథనం ప్రకారం.. రాజూర గ్రామానికి చెందిన గన్నారం భూమన్న(80)కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు భూమన్న, రెండో కుమారుడు సుదర్శన్, మూడో కుమారుడు సాయికృష్ణ. సుదర్శన్ మూడేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. సాయి కృష్ణ హైదరాబాద్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. పెద్దకుమారుడు భూమన్న భార్య సునీతకు ఏడాది క్రితం గొడవల కారణంగా పుట్టింటికి నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు వెళ్లిపోయింది. రాజూరాలో తనకున్న మూడెకరాల్లో పెద్దకుమారుడు వ్యవసాయంతోపాటు కూలీ పని వెళ్లి తండ్రి భూమన్నకు పోషించుకుంటున్నాడు. ఇద్దరు ఇంట్లో ఉంటున్నారు. మూడు రోజులుగా తిండి పెట్టటం లేదని తండ్రి, పెద్దకుమారుడి మధ్య గొడవ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఇద్దరు గొడవపడ్డారు. క్షణికావేశానికి లోనైన కుమారుడు రోకలితో తండ్రి తలపై కొట్టి హత్య చేశాడు. మృతుడి కుమార్తె సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అంతకుముందు భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ముధోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్సై అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుపై విచారణ జరిపి నిందితుడిపై చర్యలు తీసుకుంటామన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి



గోదావరి మృతదేహం

లోకేశ్వరం: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. కుంటాల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన పసుల సాయన్న– పసుల గోదావరి (40) దంపతులు. వీరు ఈనెల 6న బావమరిది కూతురు పెళ్లికి మండలంలోని పిప్రి గ్రామానికి బైక్‌పై వచ్చారు. పెళ్లి ముగించుకుని శనివారం బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. మండలంలోని హావర్గ సమీపంలోని శ్మశానవాటిక వద్ద బైక్‌పై నుంచి కళ్లు తిరిగి గోదావరి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలు గోదావరి తమ్ముడు దాస శేఖర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: మైనర్లకు వాహనాలను ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శనివారం డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు మైనర్లకు వాహనాలు ఇచ్చిన తండ్రులపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 17 ఏళ్ల మైనర్ బాలుడికి బైక్ ఇచ్చిన తండ్రి వేణుగోపాల్‌పై టూటౌన్‌లో, 12 ఏళ్ల బాలుడికి బైక్ ఇచ్చిన తండ్రి నర్సయ్యపై ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నర్సయ్య కుమారుడు బైక్‌ను పాచ్చర వద్ద స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి సేవించిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి సేవించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల శివారు ప్రాంతంలో ఆదిలాబాద్‌లోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన షేక్ జాహిర్, రవీంద్రనగర్‌కు చెందిన బాన్సోడే సంతోష్‌లు శనివారం మత్తు సేవించినట్లు అనుమానం కలిగింది. వారికి గంజాయి టెస్టు చేయగా పాజిటివ్ నిర్ధారణ అయింది. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిరాణా షాపు యజమానిపై..

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన కిరాణా షాపు యజమాని శ్రీనివాస్‌పై కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నాడని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. శనివారం మంచిర్యాల నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు నరేశ్, అంజిత్.. కిరాణా షాపులో తనిఖీలు నిర్వహించి కూల్‌డ్రింక్ బాటిల్స్, ఇతర పది రకాల వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వాటిని శ్యాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపించామన్నారు.

లైంగికవేధింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: ఓ మహిళ పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన ఓ మహిళ బంధువులు పంజాబ్‌లో నివసిస్తున్నారు. కొన్ని అవసరాల నిమిత్తం అమృత్‌సర్‌కు చెందిన అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్‌ను వీరు సంప్రదించారు. సదరు అధికారి డబ్బులు ఆశించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో పనులు చేసేందుకు నిరాకరించాడు. దీంతో అతన్ని మహిళ తరపు బంధువులు విజిలెన్స్ అధికారులకు పట్టించారు. వారిపై కక్ష పెంచుకున్న మునీష్ కుమార్ ఆదిలాబాద్‌కు చెందిన మహిళ పేరిట పేస్‌బుక్‌లో ఫేక్ ఐడీని క్రియేట్ చేసి, సదరు మహిళ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో, వన్‌టౌన్ పోలీసులు నిందితుడిని గుర్తించి అమృత్‌సర్ నుంచి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎడారి దేశంలో జిల్లావాసి జైలు జీవితం

- చేయని నేరానికి గల్ఫ్ బాధితుడి నరకయాతన
- న్యాయ సహాయం కోసం కుటుంబసభ్యుల వేడుకోలు



వివరాలు వెల్లడిస్తున్న కుటుంబసభ్యులు

నిర్మల్‌ఖిల్లా: చేయని నేరానికి అకారణంగా ఎడారి దేశంలో జైలుశిక్ష అనుభవిస్తున్న తమ కుటుంబ సభ్యుడికి న్యాయ సహాయం అందించాలని గల్ఫ్ బాధిత కుటుంబ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ స్వదేశ్ పర్కిపండ్లతో కలిసి కలిసి వివరాలు వెల్లడించారు. కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన గజకరెడ్ల సాయన్న (51) ఉపాధి నిమిత్తం గతేడాది దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 16న స్థానిక పోలీసులు అరెస్టు చేసి అబుదాబీ జైలుకు తరలించారు. సమాచారం తెలిసిన కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై ఎవరిని సంప్రదించాలని తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో ఎన్ఆర్ఐ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లను కలిసి సమస్యను వివరించారు. నిరక్షరాస్యత కారణంగా తన పేరిట ఇతరులకు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలులో వేసినట్లు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశ్ మాట్లాడుతూ బాధితుడి సమగ్ర వివరాలతో అక్కడి ఎంబసీకి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. న్యాయసహాయం ద్వారా జైలు నుంచి విడిపించే ప్రయత్నం చేస్తామని కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. బాధితుడి తల్లి భోజవ్వ, భార్య మంజుల, కుమారుడు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి తేలు కాటు

నెన్నెల: మండలంలోని గంగారాం శివారులో శనివారం ఉపాధి పనులు చేస్తున్న మహిళా కూలీ తేలుకాటుకు గురైంది. పైడిపల్లి నర్మద అటవీ సమీపంలో ఉపాధి పనులు చేస్తుండగా నల్లతేలు కుట్టింది. వెంటనే తోటి కూలీలు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని కూలీలు తెలిపారు.